క్లుప్తంగా

నేడు సామాజిక సర్వేపై గ్రామ సభ

దెందులూరు: దెందులూరులో గురువారం సాయంత్రం జాతీయ ఉపాధి హామీ పథకంపై సామాజిక సర్వేపై గ్రామసభ నిర్వహిస్తామని ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు ఫాతిమా శ్రావణ్ బుధవారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు సోషల్ ఆడిట్ గ్రామసభ హాజరు కావాలని వారు కోరారు.

9 మంది జూదరుల అరెస్ట్

దెందులూరు: దెందులూరులో బుధవారం పేకాడుతున్న 9మంది జూదరులను అరెస్ట్ చేశామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. రూ.5,720 నగదు, ఆటో, మోటార్ బైక్, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా పేకాట, కోడిపందేలు, గుండాటతో పాటు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన, సహకరించిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. పాత నేరస్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంటుందని ఆయన అన్నారు.

పారిజాతగిరిలో ధనుర్మాసోత్సవాలు



గోదాదేవిని విశేషంగా అలంకరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోదాదేవి అనుగ్రహించిన తిరుప్పావై పాశురాల్లో వేద జ్ఞానం ఇమిడి ఉందని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు తెలిపారు. శ్రీరంగనాథుడి అనుగ్రహం కోసం గోదాదేవి అందించిన తిరుప్పావై 30 పాశురాలలో వేదాలు, ఇతిహాసాలు, పురాణాల్లో పేర్కొన్న పలు అంశాలు సరళంగా ఉన్నాయని తెలిపారు. ధనుర్మాస వ్రత సందర్భంగా పదో రోజు పారిజాత గిరి ఆలయంలో గోదాదేవికి శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో విశేష సంఖ్యలో భక్తులు, వికాస తరంగిణి కార్యకర్తలు పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటదిబ్బ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజ్‌కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎ.రాజ్‌కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ధనుంజయరావు గత జూన్‌లో పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు విశ్వనాథ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా బుధవారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కృష్ణ ఇప్పటివరకు తణుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కృష్ణకి కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మనుస్మృతి ప్రతుల దహనం

జంగారెడ్డిగూడెం: స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు తొర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనారిటీ వర్గాలు ఇప్పటికీ అట్టడుగున దిక్కుతోచని స్థితిలో ఉండటానికి ఈ మనుస్మృతి కారణమని ఆ నాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా మనుస్మృతి పత్రాలను దహనం చేశారన్నారు. అదే బాటలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు కలపాల రాజకుమార్, బ్యాటరీ నాగు, కోట్నీస్, మహిళా అధ్యక్షురాలు ఎండీ సలీమా, మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ వెంపల రాజు, రాణి, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

జంగారెడ్డిగూడెం: మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ రాపిడ్ అండ్ చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక చిట్టూరి గణేశ్వర టౌన్‌హాల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సీహెచ్ వర్మ విజేతలను అభినందించారు. విజేతలతో పాటు, పాల్గొన్న చెస్ క్రీడాకారులకు నగదు, ప్రశంసా పత్రాలను, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్ గుప్త, టౌన్‌హాల్ ప్రెసిడెంట్ సచివరపు బుల్లి బుల్లయ్య, మద్దిపాటి నాగేశ్వరరావు, అలుగు ఆనందశేఖర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ ఎస్.రాధాకృష్ణ, మాస్టర్‌చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్.. చిన్నారుల ఆరోగ్యానికి దోహదం

- చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుదల
- 5 ఏళ్లలోపు పిల్లలకు సక్రమంగా వ్యాక్సినేషన్
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా విశేష సేవలు



తల్లాపురంలో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న చేబ్రోలు పీహెచ్‌సీ సిబ్బంది



నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నవజాత శిశువు నుంచి 5 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా చిన్నారులకు ప్రశంసనీయమైన సేవలందుతున్నాయి. క్రమం తప్పకుండా సక్రమంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు కావడంతో చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెరిగి వ్యాధుల సంక్రమణ తగ్గింది. దీంతో శిశుమరణాలు, అవయవ లోపాలు తగ్గుముఖం పట్టాయి. ఏలూరు జిల్లాలో 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, హెల్పర్లు అందుకోసం కృషి చేస్తున్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5 ఏళ్లలోపు పిల్లలు 2,830 మంది ఉన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల ద్వారా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయి. సబ్‌సెంటర్లలో, పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, బయట ఉన్న పిల్లలకు అవసరమైన వ్యాక్సిన్లు వేస్తున్నారు. వీరికి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా వివిధ రకాలు టీకాలు చిన్నారులకు విధిగా వేస్తూ వారు వ్యాధుల బారిన పడకుండా కాపాడుతున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలో నెలకు సుమారు 30 నుంచి 40 మంది పిల్లలు జన్మిస్తున్నారు. వీరందరికీ పుట్టగానే వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్స, వ్యాక్సిన్లు అందుతున్నాయి.

వ్యాక్సిన్ల వివరాలు ఇలా..

5 ఏళ్ల పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్ క్షయ వ్యాధి రాకుండా, పోలియో చుక్కలు వేస్తున్నారు. కోరింత దగ్గు, ధనుర్వాతం రాకుండా టావైలెంట్ వ్యాక్సిన్ వేస్తున్నారు.ఐపీవీ పోలియో ఇంజక్షన్‌తోపాటు కాలేయం సంబంధిత వ్యాధులు రాకుండా హెచ్‌ఐబీ ఇంజక్షన్ ఇస్తున్నారు. న్యూమోనియా రాకుండా రక్షణగా పీసీవీ ఇంజక్షన్ ఇస్తున్నారు. 9 నుంచి 12 నెలల పిల్లలకు ఎంఆర్- 1 వ్యాక్సిన్, మీజుల్స్, రూబెల్స్ పొంగువ్యాధి రాకుండా, విటమిన్ ఎ ద్రావణం రేచీకటి రాకుండా ఇస్తున్నారు. 1 6నుంచి 24 నెలలులోపు బూస్టర్ డోసుతోపాటు ఎంఆర్- 2 ఇస్తున్నారు.డీపీటీ వ్యాక్సిన్ వేస్తున్నారు. పది నెలలు నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రతి ఆరునెలలకు విటమిన్స్ ద్రావణం 9 సార్లు వేస్తున్నారు.5 ఏళ్ల వరకు డీటీటీ ఇస్తారు. 10 నెలలలకు, ఏడాదిన్నరకు, రెండేళ్లకు, రెండున్నరేళ్లకు, మూడేళ్లకు, ఇలా ప్రతి ఆరునెలలకు ఒకసారి పిల్లలకు వివిధ వ్యాక్సిన్ డోసులు వేస్తున్నారు.

పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి వృద్ధి



యూనివర్సల్ ఇమ్యూనిజేషన్ (యూఐపీ) కార్యక్రమం ద్వారా చిన్నపిల్లలకు వ్యాధినిరోధక శక్తిని పెంచి శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. ఇమ్యూనిజేషన్ ప్రతి బుధ, శనివారాల్లో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు అమలు చేస్తున్నారు. ఆశా వర్కర్లు సహకరిస్తున్నారు. 5 ఏళ్లలోపు వ్యాక్సిన్లు నోటిచుక్కల ద్వారా అందిస్తున్నాం. ప్రజలు చైతన్యవంతులై యూఐపీని ఉపయోగించుకుంటున్నారు.

– డాక్టర్ సుబ్బరాజు వర్మ, పీహెచ్‌సీ డాక్టరు, చేబ్రోలు

సక్రమంగా వ్యాక్సినేషన్ అమలు



వ్యాక్సిన్ వేయడం ద్వారా చిన్నారులను ఎన్నో వ్యాధుల నుంచి రక్షించగలుగుతున్నాం. పూర్వం చిన్నారులకు అనేక రకాల వ్యాధులు సోకి బాధపడేవారు. అలాంటి పరిస్థితి నేడు గ్రామాల్లో లేదు. టీకాలు, మీజుల్స్, చుక్కల మందు వేయడం ద్వారా పిల్లలకు వ్యాధినిరోధక శక్తి వృద్ధి చెందుతోంది. రికార్డు స్థాయిలో పీహెచ్‌సీలో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేస్తున్నాం.

– వీవీ నాగలక్ష్మి, పీహెచ్‌సీ సూపర్‌వైజరు, చేబ్రోలు

మంచుకురిసే వేళలో..



రహదారిని కమ్మిన మంచు దుప్పటి



మంచు తెరల్లో వరి కుప్ప

పెదవేగి : మంచుకురిసే వేళలో ప్రకృతి అందాలు వర్ణనాతీతం. బుధవారం ఉదయం రోడ్లు, పంట పొలాలను కమ్మేసిన మంచు తెరల దృశ్యం కనువిందు చేసింది. ఇళ్లపై దుప్పటి మాదిరిగా మంచు పర్చుకుంది. సూరీడు కూడా మంచు పొరలను చీల్చుకుంటూ ఉదయం వేళ వెలుగులు ప్రసరింపజేయటానికి అష్టకష్టాలు పడ్డాడు. దాళ్వా నారుమడులు మంచు పరదాలు కప్పుకున్నాయి. ఆకులు, పండ్లపై మంచు బిందువులు జారిపోతూ ప్రకృతి ఆరాధకులను మైమరపించింది. మండల కేంద్రమైన పెదవేగిలో ఈ సుందర దృశ్యాలు బుధవారం తెల్లవారుజామున ఇలా దర్శనమిచ్చాయి.

అలరిస్తున్న హరిదాసుల గానాలాపన

గ్రామాలకు సంక్రాంతి శోభ

పెదవేగి : హరిలో రంగ హరి అంటూ వేకువజామున శ్రీహరి నామాన్ని కీర్తిస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరుగుతున్న హరిదాసులతో గ్రామాలు సంక్రాంతి కళను సంతరించుకున్నాయి. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతున్న హరిదాసు అక్షయ పాత్రలో చిన్నారులు, మహిళలు బియ్యం, కూరగాయలు వేస్తారు. పెదవేగి పరిసర ప్రాంతాలకు చెందిన బోయిన వెంకటదాసు తాత వెంకటస్వామి, ముత్తాతల దగ్గర నుంచి వారసత్వంగా హరిదాసుగా సంక్రాంతి నెలరోజులు గ్రామాల్లో తిరుగుతూ హరినామ సంకీర్తన చేస్తున్నారు. సంక్రాంతి నెలరోజులపాటు హరినామ సంకీర్తనతో గడుపుతామని ఆయన చెప్పారు. హరిదాసుగా గ్రామల్లో తిరిగితే భక్తులు ఇచ్చే బియ్యం, కానుకలతో కుటుంబాన్ని పోషించుకుంటానని ఆయన చెప్పారు. మిగిలిన రోజుల్లో కూలి పనులకు వెళతానని ఆయన తెలిపారు. వారసత్వంగా వస్తున్న ఆ సంప్రదాయాన్ని తండ్రి దగ్గర నుంచి తాను స్వీకరించానని, హరినామ సంకీర్తనతో మానసికంగా ఎంతో తృప్తి ఉంటుందని ఆయన చెప్పారు. ఒక్కో హరిదాసుడు ఒక్కో గ్రామాన్ని దత్తగా తిరుగుతూ కుటుంబ పోషణ చేసుకుంటున్నామని ఆయన తెలిపారు.



హరిదాసు అక్షయపాత్రలో బియ్యం వేస్తున్న చిన్నారి

పోరుబాటతో ప్రభుత్వం కళ్లు తెరిపించాలి



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, నాయకులు

గణపవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, ప్రజలపై పన్నుల బాదుడు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టనున్న పోరుబాట కార్యక్రమం పోస్టర్లను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓట్లువేసిన ప్రజలను దగా చేస్తోందని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల నడ్డివిరిగేలా పన్నులు వేసి, బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. విద్యుత్ చార్జీల భారం రూ.13,500 కోట్లు గత ఆరునెలల్లో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిందని ఆయన విమర్శించారు. కొత్త సంవత్సరంలో మరో పదివేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల వడ్డించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను బూటకపు హామీలతో నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నింటినీ చాప చుట్టేసిందన్నారు. చంద్రబాబు మోసాలపై వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఆందోళనలు చేపడుతుందన్నారు. హామీలను అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుందని అన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27న విద్యుత్ బిల్లుల మోతపై ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఈనెల 27న ఉదయం పది గంటలకు నారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని, తద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపిద్దామని వాసుబాబు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి బాబులు, కోడే కాశీ, తుమ్మగుంట రంగాభవాని, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్యశ్రీనివాస్, పార్టీ నాయకులు వెజ్జు వెంకటేశ్వరరావు, పుప్పాల గోపి, ఎలిశెట్టి బాబ్జీ, ధనుకొండ శ్రీను, రొంగల శ్రీను, రామకుర్తి నాగేశ్వరరావు, కాన్వెంట్ శ్రీను, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సూర్యబలిజ విభాగం అధ్యక్షుడు శెట్టి రాజా పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): సీపీఐ శత వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని, ఈ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సీపీఐ శత వార్షికోత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో సామ్యవాద వ్యవస్థ స్థాపన కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ ఈనెల 26వ తేదీ నాటికి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడలా సభలు,సమావేశాలు నిర్వహించి దేశంలో,రాష్ట్రంలో,జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ చేసిన పోరాటాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. లోక్ సభ సాక్షిగా రాజ్యాంగాన్ని గౌరవిస్తామంటూనే హోం మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దీనికి నిరసనగా సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

భీమడోలు: దేశాభివృద్ధికి మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు మండల బీజేపీ కార్యాలయంలో బుధవారం వాజ్‌పేయి శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్సీ సెల్ యువమోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి, నియోజకవర్గ కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాకిన సత్యనారాయణ, బుర్రె మూర్తి, టి.రామ్మూర్తి, మండల నాయకులు, గ్రామ బూత్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళులు

ఉంగుటూరు: మాజీ ప్రధాని, భారతరత్న వాజ్‌పేయి జయంతిని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం వాజ్‌పేయి చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. గుళ్లపాడు, యరమళ్ల, ఉంగుటూరులో వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు.



భీమడోలులో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆనందోత్సాహాలతో క్రిస్మస్ సంబరాలు

- ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలు
- విద్యుద్దీపాల కాంతులతో ప్రకాశిస్తున్న మందిరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



పెదవేగి : విజయరాయిలోని పునీత ఆంథోని ఆలయం



పెదవేగి : కూచింపూడి ఆర్‌సీఎం చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న గురువులు



గణపవరం: చర్చిలో ప్రసంగిస్తున్న వాసుబాబు



భీమడోలు: ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్లు, సిస్టర్లు



భీమడోలు: ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం రాత్రి ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



గణపవరం: సీసీఎస్‌సీ చర్చి వద్ద ఏర్పాటు చేసిన పశువులపాకలో క్రీస్తు జనన ఘట్టం ప్రదర్శన



పెదపాడు: క్రైస్తవ దేవాలయంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

పెదవేగి : సమాజాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చడానికి సృష్టికర్త, ప్రభువైన క్రీస్తు మానవుడి రూపంలో జన్మించారని క్రైస్తవ మత గురువులు బోధించారు. మండలంలోని గ్రామ, గ్రామాన క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వరకూ క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయా చర్చిల ఫాదర్‌లు, పాస్టర్‌లు క్రీస్తు జనన సారాంశాన్ని భక్తులకు తెలియజేశారు. చిన్నారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

- వేగివాడలోని ఆర్‌సీఎం దేవాలయంలో ఫాదర్ పాస్కలీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విజయరాయిలో పునీత ఆంథోని దేవాలయంలో ఫాదర్ దివాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాయన్నపాలెంలోని హోరేబు చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.పెదవేగిలోని పెంతెకోస్తు దేవాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యాయంపల్లిలో స్థానిక విచారణ పరిధిలోని కూచింపూడి ఆరోగ్యమాత దేవాలయంలో ఫాదర్ రాచూరి బాలస్వామి, ఆధ్వర్యంలో విశ్వాసులు క్రీస్తు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.

ఏసుక్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి స్థాపన

గణపవరం: సమాజంలో అశాంతిని పారద్రోలి, శాంతి స్థాపనకు ఏసుక్రీస్తు బోధనలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం రాత్రి ఆయన క్రీస్తు జన్మదిన వేడుకల్లో పాల్గొని విశ్వాసులనుద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా వాసుబాబు కేకుకోసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వాసుబాబును స్థానికులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ అధ్యక్షుడు సంకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

ఉంగుటూరు: మండలం పరిధిలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యుత్ దీపాలతో చర్చిలను సుందరంగా అలంకరించారు.

వాడవాడలా ప్రత్యేక ప్రార్థనలు

భీమడోలు: ఏసుక్రీస్తు బోధనలు అనుసరిస్తూ శాంతి సమాధానాలు పొందాలని ఏలూరు డివైన్ ధ్యాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్నీ అన్నారు. మండల వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదిన వేడుకలు క్రైస్తవాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి జాగరణ ప్రార్థనలు నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పోలసానిపల్లి, కోడూరుపాడు, కొల్లేరు గ్రామాల్లోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, పెంతెకోస్తు, రక్షణ సైన్యం, ఏసుక్రీస్తు ప్రార్థన మందిరాల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త ఫాదర్ షింటో ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసారు. ఏలూరు డివైన్ ధ్యాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్నీ దివ్యపూజా బలిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీపాల్ స్కూలు ప్రిన్సిపల్ నెల్సన్, బీడీఎస్ డైరెక్టర్ ఫాదర్ జింటో, ఫాదర్ జిజో, కన్యస్త్రీలు, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, మరియదళ సభ్యులు విశ్వాసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

దెందులూరు: క్రిస్మస్ వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ఆర్‌సీఎం, సాల్వేషన్ ఆర్మీ, సీఎస్ఐ, ఐసీఎం, మన్నా, సెవెంత్ డే, ట్రూ లైట్, పెంతెకోస్తు, బెతస్థ చర్చిలతో పాటు అన్ని స్వతంత్ర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దెందులూరు మిలీనియం సాల్వేషన్ చర్చిలో స్థలదాత రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లె యోహాను హర్షవర్ధన్ మనవరాలు బెనిత గౌతమి ఆధ్యాత్మిక నిత్య ప్రదర్శన చేశారు. క్యాండిల్స్‌తో ఆరాధన క్రైస్తవ గీతాలాపన చేశారు. పాస్టర్లు, ఫాదర్లు అమ్మెన్ రాజు రమణయ్య బెంజిమెన్ శాంతి సందేశం అందించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్ని చర్చిల ఫాదర్లు, పాస్టర్లు, సిస్టర్లు, సంఘస్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రైస్తవ విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు

గణపవరం: క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గణపవరం, నిడమర్రు మండలాల్లోని పలు చర్చిల్లో నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.

- పేదలకు సహాయం: క్రిస్మస్ సందర్భంగా గణపవరం మండలం పిప్పరకు చెందిన సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు పేదలకు, రోగులకు సుమారు వంద మందికి ఆర్థిక సహాయం అందజేశారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు: క్రిస్మస్ పండుగ వేడుకలు మండలం పరిధిలోని చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ దేవాలయాల్లో విశ్వాసులంతా బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.